
# నిర్వహణ భారమా.. నాణ్యత లోపమా?

- శిథిలావస్థకు చేరుతున్న డీపీఆర్‌సీ భవనం
- గోడలకు పగుళ్లు.. ఊడిపోయిన బాత్‌రూం తలుపులు, సింకులు
- పనిచేయని సీసీ కెమెరాలు.. పగిలిపోతున్న టైల్స్
- పట్టించుకోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు

మామిళ్లగూడెం, ఆగస్టు 30 : పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం ఖమ్మంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన జిల్లా పంచాయతీ మౌలిక వనరుల కేంద్ర భవనం(డీపీఆర్‌సీ) శిథిలావస్థకు చేరుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారంగా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ భవనాన్ని నిర్మించింది. జిల్లాలో స్థానిక సంస్థల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పంచాయతీరాజ్ చట్టాలు, విధులు, నిబంధనలపై శిక్షణ ఇచ్చేందుకుగాను దీని నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని శాఖల విభాగాల సమావేశాలు నిర్వహించేందుకు అనువుగా భవనం నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ మొదటిసారి అధికారం చేపట్టిన తరువాత నాటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు 2017 అక్టోబర్‌లో శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయంతో ప్రారంభించిన పనులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ చేశారు.


బాత్‌రూంలో ఊడిన తలుపులు

## శిథిలావస్థకు చేరుకుంటున్న భవనం

భవనం పనులు పూర్తి చేసుకుని వినియోగానికి సిద్ధంగా ఉండడంతో అధికారులు వినియోగంలోకి తీసుకొచ్చారు. నూతనంగా ప్రారంభించిన భవనం అప్పుడే శిథిలావస్థకు చేరుకుంటుండడంతో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. ప్రధాన మీటింగ్ హాల్‌కు రెండు పక్కల భీమ్‌లకు ఆనుకొని ఉన్న గోడలకు పగుళ్లు వచ్చి సిమెంట్ పెచ్చులు ఊడిపోతున్నాయి. భవన ప్రధాన ద్వారం పక్కనే గోడలకు పగుళ్లు రావడంతో ప్రజలకు లోపాలు తెలుస్తున్నాయన్న ఉద్దేశంతో అధికారులు తాత్కాలికంగా దానికి వైట్ సిమెంట్ పూసి కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. భవనంలో మహిళలకు కేటాయించిన మరుగుదొడ్లలో గదులకు బిగించిన తలుపులు ఊడిపోయాయి. అదే గదిలో చేతులు కడుక్కునేందుకు బిగించిన వాష్ బేసిన్ ఊడిపోవడంతో పక్కన పడేశారు. దీంతోపాటు ప్రధాన మీటింగ్ హాల్ వరండాలో కూడా ఫ్యాన్స్ బిగించాల్సి ఉండగా.. కాంట్రాక్టర్ వాటిని బిగించకుండానే భవనం అప్పగించడంతో అధికారులు స్వాధీనం చేసుకొని వినియోగిస్తున్నారు. భవనం బయట పార్కింగ్ ఏరియాలో వేసిన పార్కింగ్ టైల్స్ పగిలిపోయి అప్పుడే ఊడిపోతున్నాయి. భవనంలో రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. భవనం చుట్టూ చెత్త పేరుకుపోవడంతోపాటు వివిధ మీటింగ్‌ల సమయంలో వినియోగించిన బోర్డులు, ఇతర ఫ్లెక్సీలు అక్కడే వదిలేయడంతో ఆవరణ అంతా చెత్తతో నిండిపోయింది.



పనిచేయని సీసీ కెమెరాలు, బాత్‌రూంలో ఊడిన వాష్ బేసిన్లు

## నిర్వహణను పట్టించుకోని ఇంజినీరింగ్ విభాగం

డీపీఆర్‌సీ భవన నిర్వహణను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న ఈ భవనం మరమ్మతులకు రావడంతో దానిపై దృష్టిసారించే వారే కరవయ్యారు. నిర్మాణంలో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ పనులు పర్యవేక్షించిన ఇంజినీరింగ్ అధికారులు మిన్నకుంటున్నారు. పనులు చేపట్టిన గుత్తేదారుకు బిల్లులు చెల్లించిన అధికారులు నిర్వహణలో నాణ్యతా లోపాలు సవరించే పరిస్థితి కనిపించడం లేదు. లోపాలు ఈ స్థాయిలో ఉన్నప్పుడే వెంటనే మరమ్మతులు చేపడితే తక్కువ నిధులు మాత్రమే ఖర్చు అవుతాయని, వాటిని ఇలానే వదిలేస్తే మరో ఏడాదిలో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం లేకపోలేదు.

### పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

భవనం ప్రారంభించి ఐదేళ్లు అవుతున్నది. భవనంలో వచ్చిన పగుళ్లు, ఇతర లోపాలను పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. భవనంలో నాణ్యతా లోపాలు ఉంటే గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

**– యడిత్యారాజు, ఏఈఈ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం**

# పెసర్ల కొనుగోళ్లు షురూ..

## మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వైరా, ఖమ్మంలో కేంద్రాలు ఏర్పాటు


## 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన యంత్రాంగం


ఖమ్మం ఏఎంసీలో పెసర్లను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ అధికారులు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 30 : విక్రయానికి పెసర రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా జిల్లాలోని వైరా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 'మద్దతు ధర మిథ్య!' అనే శీర్షికన పెసర సాగు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన యంత్రాంగం.. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన పంటను తేమ యంత్రాల ద్వారా శాతాన్ని నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెసర పంటకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు నాణ్యమైన పంటను కేంద్రానికి తీసుకొస్తే క్వింటాకు రూ.8,682 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. పంట ఉత్పత్తులను విక్రయించడానికి వచ్చే రైతులు విధిగా పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, పెసర పంట సాగు ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం కోశాధికారి తల్లాడ రమేశ్, దిగుమతి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పలరావు, కల్వకుంట్ల గోపాల్‌రావు, అపరాల యార్డు సూపర్‌వైజర్ ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పు లేదని అబద్ధం..!

- కరూర్ వైశ్యా బ్యాంక్‌లో ఓ రైతుకు పంట రుణం ఉన్నది నిజం
- రుణమాఫీ చేయకుండా తప్పించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- 'అసలు నీకు రుణమే లేదు' అంటూ బుకాయింపు
- రుణమాఫీ గాథల్లో మరో విచిత్రం



కరూర్ వైశ్యా బ్యాంక్‌లో అప్పు సున్నాగా ఉందంటూ అధికారులు ఇచ్చిన 'రైతు సమాచార పత్రం'

టేకులపల్లి, ఆగస్టు 30 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 'రైతు రుణమాఫీ'లో ఎన్నో చిత్రవిచిత్ర గాథలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా మరో విచిత్రం వెలుగులోకి వచ్చింది. బ్యాంక్‌లో అసలు అప్పునే లేదంటూ ఓ రైతుకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకట్రావు జిల్లాకేంద్రం కొత్తగూడెంలోని కరూర్ వైశ్యా బ్యాంక్‌లో ఖాతా నెంబర్ 4810272000000047 పేరుతో 2021 ఫిబ్రవరిలో వ్యవసాయ రుణం తీసుకున్నాడు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీకి తాను అర్హుడైనప్పటికీ మాఫీ కాలేదు. దీంతో వ్యవసాయ అధికారులను సంప్రదించగా.. వారు 'రైతు సమాచార పత్రం' చేతిలో పెట్టారు. అది చూసిన రైతు నివ్వెరపోయాడు. 9-12-2023 తేదీ నాటికి తనకు బ్యాంకులో ఉన్న బకాయి జీరో లేదా నెగటివ్‌లో ఉన్నట్లు దానిలో ఉంది. ఇదేమిటని అధికారులను అడిగితే.. బ్యాంక్‌లో సంప్రదించాలని ఉచిత సలహా ఇచ్చారు. చేసేదిలేక ఆ రైతు కరూర్ వైశ్యా బ్యాంక్‌కు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించగా.. దానిలో 27-8-2024 తేదీ నాటికి రూ.1,63,258 అప్పు ఉన్నట్లు ఉంది. ఇదెక్కడి విచిత్రమో అర్థంకాక ఆ రైతు తల పట్టుకున్నాడు. తన సమస్యను ఎవరు పరిష్కరిస్తారో తెలియక మదనపడుతున్నాడు.

### రుణం మైనస్‌లో ఉందని మాఫీ కాలే..



నా పేరు మీద కొత్తగూడెం కరూర్ వైశ్యా బ్యాంక్‌లో రూ.లక్షన్నర పైగా అప్పు ఉంది. కానీ.. నాకు మాఫీ కాలేదు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే 9-12-2023 నాటికి బ్యాంక్‌లో బకాయి ఉన్న రుణం సున్నా లేక నెగటివ్‌లో ఉన్నదని చెప్పారు. ఇదేమిటని అడిగితే.. సరైన సమాధానం చెప్పడం లేదు. పెద్దసార్లు నా యందు దయ ఉంచి రుణమాఫీ చేయాలని కోరుతున్నా.

**– సూరేపల్లి వెంకట్రావు, రైతు, కోయగూడెం, టేకులపల్లి**

# విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

## భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్


విద్యార్థినుల ప్రగతిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్(భద్రాచలం), ఆగస్టు 30 : విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తీర్ణతా శాతం పెంచాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డార్మెటరీ బ్లాక్, కిచెన్ షెడ్డు, కూరగాయలు, పాఠశాల లోపల, బయట తరగతి గదులు, టాయిలెట్స్, బాత్‌రూంల నిర్వహణను పరిశీలించారు. ఆహారాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా.. అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతుల గురించి హెచ్‌ఎంలు, వార్డెన్లు గమనిస్తూ ఉండాలని, సీజనల్ వ్యాధులకు గురైతే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలన్నారు. రాత్రివేళ విద్యార్థినులను చదివించడానికి ఉపాధ్యాయులు స్థానికంగా ఉండాలని, సబ్జెక్టుల్లో ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేయాలన్నారు. 5, 8, 10 తరగతుల విద్యార్థినులకు గణితం బోధిస్తున్న తీరును పరిశీలించిన ఆయన విద్యార్థుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణను ప్రతిరోజూ శుభ్రం చేయించాలని, వార్డెన్లు ఇందుకోసం ప్రత్యేక బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

## ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్


పోలీసుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీపీ సునీల్ దత్

మామిళ్లగూడెం, ఆగస్టు 30 : మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, క్రీడలతో స్నేహభావం అలవడుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సిటీ పోలీస్ శిక్షణ కేంద్రం పరేడ్ మైదానంలో ట్రైనీ కానిస్టేబుళ్ల రెండు రోజుల క్రీడా పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీస్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జెండా ఊపి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్, క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 70 శాతం శిక్షణా కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న 263 మంది సివిల్, ఏఆర్ ట్రైనీ కానిస్టేబుళ్లను అభినందించారు. నిత్యం ఇండోర్, అవుట్ డోర్ శిక్షణలో నిమగ్నమై ఉన్న సిబ్బందికి మానసిక ప్రశాంతత కోసం వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీలు రవి, సర్వయ్య, ఆర్ఐలు అప్పలనాయుడు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న సీపీ సునీల్ దత్

# అల్పపీడన ప్రభావం

## ఖమ్మం నియోజకవర్గంలో భారీ వర్షం

## పలు మండలాల్లో మోస్తరు వాన



ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 30 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం ఖమ్మం జిల్లాపై శుక్రవారం స్పష్టంగా కన్పించింది. ఉదయం నుంచి కొంత పొడి వాతావరణం ఉన్నప్పటికీ సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కన్పించింది. ఖమ్మం నియోజకవర్గంలో దట్టమైన మేఘాలు అలుముకోవడంతోపాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో దాదాపు 30 నిమిషాలపాటు భారీ వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఖమ్మంలోని ప్రధాన సెంటర్లలో నాలాలు పొంగడంతో రోడ్లమీద వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు యాతన పడ్డారు. అలాగే, జిల్లాలోని పలు మండలాల నుంచి వివిధ పనుల నిమిత్తం ఖమ్మానికి వచ్చిన ప్రజలు కూడా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అలాగే, ఖమ్మం నగరంతోపాటు శివారు ప్రాంతాలైన చింతకాని, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లోనూ మోస్తరు వర్షం కురిసింది. కాగా, ప్రస్తుతం వానకాలంలో సాగు చేస్తున్న వరి, పత్తి పంటలకు ఈ వర్షం ప్రాణం పోసింది. మిర్చి తోటలు సాగుచేసే రైతులకు కలిసివచ్చినట్లయింది. అలాగే, మరో రెండు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించిన విషయం విదితమే.


వరదలోనే వెళ్తున్న వాహనదారులు


చెరువులను తలపిస్తున్న నగరంలోని ప్రధాన రహదారి

# సింగరేణిపై కాంగ్రెస్ ఆధిపత్యం

## ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 30 : కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థపై ఆధిపత్యం చెలాయిస్తూ రాజకీయ జోక్యానికి పాల్పడుతోందని, ఈ విధానం సింగరేణి మనుగడకు ప్రమాదకరంగా మారిందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు, కేంద్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌లు ఆరోపించారు. కొత్తగూడెంలోని యూనియన్ కేంద్ర కార్యాలయం శేషగిరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థను దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ సొమ్మొకరిది.. సోకొకరిది అన్న చందంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మిక వాడల అభివృద్ధికి, కుటుంబాల సంక్షేమానికి వినియోగించాల్సిన సీఎస్‌ఆర్ నిధులను దారిమళ్లిస్తూ.. సంస్థకు, కార్మికులకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు కావొస్తున్నా గుర్తింపు ధ్రువపత్రం అందించడంలో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. నాలుగేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం తమ తీరు మార్చుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మిర్యాల రంగయ్య, సారయ్య, వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్, రాంగోపాల్, గట్టయ్య, రమణమూర్తి, క్రిష్టఫర్, రాములు, రాము పాల్గొన్నారు.

# పర్యావరణ హితానికి ప్రాధాన్యమివ్వాలి

- మట్టి గణపతులను ప్రతిష్ఠించేలా ప్రచారం నిర్వహించాలి
- అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలు జరపాలి
- స్తంభాద్రి ఉత్సవ కమిటీ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ఖాన్


మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, ఆగస్టు 30: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణ హితానికి ప్రాధాన్యమివ్వాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకాంక్షించారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పీవోపీ విగ్రహాల వల్ల ఎన్నో అనర్థాలున్నాయనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలు, గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవ కమిటీ బాధ్యులు అన్ని శాఖల సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. మండపాల వద్ద పారిశుద్ధ్యం, విద్యుత్ ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో పూర్తిస్థాయి బారికేడ్లు, తాగునీరు, లైటింగ్, మొబైల్ టాయిలెట్లు, సహాయ కేంద్రాలు, వైద్య శిబిరాలు వంటివి ఏర్పాటుచేయాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్‌లను ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మండపాల్లో విగ్రహ ప్రతిష్ఠ సమయంలో పోలీసుల సహకారం ఉంటుందన్నారు. ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ప్రసాదరావు, రాజేశ్వరి, గణేశ్, రాజేందర్, ఉత్సవ కమిటీల బాధ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికైన రామారావు



రఘునాథపాలెం, ఆగస్టు 30 : రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డుకు రఘునాథపాలెం మండలం కోయచలక గ్రామానికి చెందిన చెరుకూరి రామారావు ఎంపికయ్యారు. ఈ మేరకు వైరా కృషి విజ్ఞాన కేంద్రం రామారావుకు లేఖ అందించింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా ఓ రైతును ఉత్తమ అవార్డుకు ఎంపిక చేస్తారు. ఈ ఏడాది జరిగే 10వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా కోయచలకకు చెందిన రామారావుకు ఈ అవకాశం దక్కింది. సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే వార్షికోత్సవంలో రామారావు ఉత్తమ రైతు అవార్డు అందుకోనున్నారు. కాగా.. రామారావుకు అవార్డు లభించడం పట్ల గ్రామస్తులతోపాటు మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.